# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :12 సంచిక :291 బుధవారం 17-6-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/



## జూన్ 22 వరకు టెలిగ్రాం యాప్ బ్లాక్

- నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం
- జూన్ 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్ నిలిపివేత
- పేపర్ లీకేజీలను అరికట్టేందుకే కఠిన ఆంక్షలు
- తక్షణమే అమల్లోకి వచ్చిన టెలిగ్రామ్ నిషేధం
- ఎన్టీఏ మార్గదర్శకాలతో రంగంలోకి ప్రభుత్వం
- చీటింగ్ ముఠాల గుట్టురట్టు చేసేందుకే ఈ చర్యలు
- అభ్యర్థులను టార్గెట్ చేస్తున్న గ్రూపులపై నిఘ

న్యూఢిల్లీ

కేంద్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రాం యాప్‌ను ఇండియా బ్లాక్ చేసింది. జూన్ 22వ తేదీ వరకు టెలిగ్రాం యాప్ అందుబాటులో ఉండదు. జూన్ 21వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ రీ-ఎగ్జామ్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక జూన్ 30వ తేదీ వరకు టెలిగ్రాం యాప్‌లో ఉన్న మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా ప్రభుత్వం డిజైబుల్ చేసింది. ఎగ్జామ్ మెటీరియల్‌ను లీకేజీ చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ చర్యలకు చేపట్టింది. మెసేజింగ్ ఫ్లాట్‌ఫామ్‌కు చెందిన యాప్‌ను తక్షణమే బ్లాక్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇచ్చిన

-మిగతా 2 లో

## సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

### రైతు వేదికల వద్ద అందుబాటులోకి తేవాలి

- సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి
- వ్యవసాయంలో ఏఐ , టెక్నాలజీ వినియోగం పెరగాలి
- అగ్రికల్చర్ యూనివర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం
- సీడ్స్ నుంచి కొనుగోలు వరకు శాఖల సమన్వయం
- సబ్సిడీపై 7 రకాల సన్నవడ్ల పంపిణీ
- వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ సూచన

హైదరాబాద్,

ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు.

-మిగతా 2 లో





## 'అన్నలు' లేరని అలుసుగా తీసుకుంటే ఖబర్దార్!

- అడవిలో ఉన్నోళ్లంతా ఇప్పుడు మా పార్టీలోనే ఉన్నారు
- సింగరేణిలో అక్రమాలను నిలదీస్తూనే ఉంటాం
- శ్రీరాంపూర్ ఆర్కే-7 గని వద్ద ఉద్రిక్తత.. గేట్లు తోసుకుని వెళ్లిన కేడర్
- 'బొగ్గుబాయి' బాటలో సింగరేణి యాజమాన్యంపై కవిత తీవ్ర ధ్వజం

మంచిర్యాల

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తలపెట్టిన భూగర్భగని వద్ద 'బొగ్గుబాయి' కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవిత, టీఆర్‌ఎస్ శ్రేణులు, కార్మికసంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. గేట్లను తోసుకొని కవిత, పార్టీ శ్రేణులు గని ఆవరణలోకి దూసుకెళ్లారు. 'బొగ్గు బాయి' కార్యక్రమంలో తమను అడుగడుగునా సింగరేణి యాజమాన్యం అడ్డుకుంటుందని, కార్మికులతో కలిసి గేట్ మీటింగ్ పెట్టుకునే హక్కు తమకు ఉందని ఈ సందర్భంగా కవిత అన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు కనీసం తాగునీటి సౌకర్యం

-మిగతా 2 లో



## హర్మ్యూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

- నౌకలు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతి
- శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుంది
- ఇరాన్‌పై కుదిరిన ఒప్పందాన్ని త్వరలో వెల్లడిస్తా
- జి 7 సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన

ప్యారిస్

ఫ్రాన్స్‌లో జీ 7 సదస్సు వేదికగా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హోర్ముజ్ శాశ్వతంగా టోల్ రహితంగా ఉంటుందని వెల్లడించారు. సమ్మిట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం చేశారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుందని.. ఇకపై అది శాశ్వతంగా టోల్ ఫ్రీగా అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. అలాగే ఇరాన్‌తో కుదిరిన

-మిగతా 2 లో

## రాహుల్ కి నిజాయితీ లేదు

- రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలనే బలహీనపరుస్తున్నారు
- ఇండియా బ్లాక్‌లో పెరుగుతున్న అసంతృప్తికి కాంగ్రెస్సే కారణం
- పార్లమెంటు ఎన్నికల్లో మద్దతు కోరి.. రాష్ట్రాల్లో వెన్నుపోటు
- ఫలితాల అనంతరం డీఎంకేకు చెప్పకుండా టీవీకే వైపు..
- హస్తం పార్టీ ప్లేటు ఫిరాయింపుపై తమిళనాడు అధికార పక్షం ఆగ్రహం
- కాంగ్రెస్ పార్టీతో ఇక ఎప్పటికీ పొత్తు పెట్టుకోం: డీఎంకే స్పష్టీకరణ



చెన్నై

ద్రవిడ మున్నేత్ర కజగం (డిఎంకె) లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల గురించి.. కాంగ్రెస్ వ్యవహరించిన తీరుపైన డిఎంకె ఆరోపించింది. రాజకీయ పరిణతి, పారదర్శకత లేకపోవడమే ఇండియా బ్లాక్‌లో పెరుగుతున్న అసంతృప్తికి కారణమని డిఎంకె పత్రిక 'మురసోలి' ఎండగట్టింది. జాతీయ పార్లమెంటు

-మిగతా 2 లో

## కేసీఆర్ హయాంలో స్కీములు.. కాంగ్రెస్‌లో స్కాములు

- కరోనా కష్టకాలంలోనూ కేసీఆర్ రైతుబంధు ఆపలేదు
- రేవంత్‌ను ముమ్మాటికీ ఎగవేతల రేవంత్ అనే అంటాను
- కేసులు పెట్టినా భయపడేది లేదు: హరీశ్ రావు ధీమా
- రైతుబంధు కింద రూ. 19 వేల కోట్లు ఎగబెట్టిన రేవంత్ సర్కారు
- సివిల్ సప్లైస్, సింగరేణి, గూడ్స్ రోడ్లలో వందల కోట్ల కుంభకోణాలు
- పథకాలకు ఖజానా లేదు కానీ.. వాస్తు మార్పులకు వందల కోట్లా?
- డిస్కంల పేరుతో రైతులకు విద్యుత్ కోతలు విధించే కుట్ర



కరీంనగర్,

తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక కేసీఆర్ హయాంలో స్కీంలు చేపడితే కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు స్కాంలకు పాల్పడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. ఎగవేతల రేవంత్ అంటే తనపై తిమ్మాపూర్ స్టేషన్ లో కేసు పెట్టినారని, ఇటీవల నోటీసులు ఇచ్చారని, ఆయన ఎగవేతల రేవంత్ అని మరోసారి అన్నారు. రైతు బంధు రూ.19వేల కోట్లు ఎగబెట్టారని అన్నారు. కేసీఆర్ హాయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు.

-మిగతా 2 లో

## అమెరికాలో కూలిన బీ-52 బాంబర్ విమానం..

- 8 మంది సిబ్బంది మృ
- టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే మోజావే ఎడారిలో ఘోర ప్రమాదం
- ఎడ్‌వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో పరీక్షల సమయం లోనే విషాదం
- రాడార్ ఆధునీకరణ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న బాంబర్ విమానం
- ఫ్లైట్ కంట్రోల్ లోపమే కారణమా?.. దర్యాప్తుకు ఆరు నెలల సమయం



లాస్ ఏంజిల్స్:

అమెరికాలో బీ-52 బాంబర్ విమానం కూలింది. ఈ ఘటనలో 8 మంది సిబ్బంది మృతిచెందారు. దక్షిణ కాలిఫోర్నియాలోని మోజావే ఎడారిలో ఉన్న ఎయిర్ ఫోర్స్ బేస్‌లో ఈ ప్రమాదం సంభవించింది. టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకే ఆ బాంబర్ విమానం నేలరాలింది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 11.20 నిమిషాలకు ఈ ప్రమాదం జరిగింది. ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో రొటీన్‌గా పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. లాస్ ఏంజిల్స్ నగరానికి ఉత్తరం దిక్కున ఈ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఉన్నది.బీ-52

-మిగతా 2 లో

## బీజేపీకి లబ్ధి చేకూర్చేలా 'సార్' ప్రక్రియ

### కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి తోత్తుగా మారింది

- పశ్చిమ బెంగాల్‌లో 92 లక్షల ఓట్ల అక్రమ తొలగింపు
- బీఎల్‌ఏలు కీలకంగా పనిచేస్తేనే ఓట్లకు రక్షణ
- కమలం పార్టీ ఆడించినట్లే ఆడుతున్న పవన్ కల్యాణ్
- మోదీ, అమిత్ షాల కంటే పెద్ద చక్రవర్తులే కాలగర్భంలో కలిసిపోయారు
- 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో కిషన్ రెడ్డి చిట్టా ఇవ్వాలి
- మూసీ ప్రక్షాళనకు నిధులు ఇవ్వకుండా కేంద్రం అరాచకం
- బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో పిసిసి చీఫ్ విమర్శలు



సంగారెడ్డి,

కేవలం బిజెపికి లాభం చేకూర్చేలా సర్ ప్రక్రియ సాగుతోందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. ఈ పక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని ,

-మిగతా 2 లో

## పారదర్శకంగా యూరియా పంపిణీ

- ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్
- ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ది
- క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కామారెడ్డి

:రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు



అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు

-మిగతా 2 లో



## ద్రోణి ప్రభావంతో రాష్ట్రావ్యాప్తంగా వర్షాలు

- బుధవారం పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వానలు
- కొన్నిచోట్ల వర్షం.. మరికొన్ని చోట్ల భానుడి ప్రతాపం
- విజయనగరం నుంచి తిరుపతి వరకు మోస్తరు వర్ష సూచన

అమరావతి

తూర్పు విదర్భ, తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో బుధవారం కొన్నిచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు, కొన్నిచోట్ల ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి

-మిగతా 2 లో

## జూన్ 22 వరకు టెలిగ్రాం
# యాప్ బ్లాక్

మొదటి తరువాయి

మార్గదర్శకాల ఆధారంగా ఈ చర్య చేపట్టారు. కేవలం ఎగ్జామినేషన్ పీరియడ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ యాప్‌ను రద్దు చేశారు. పేపర్ లీక్ ఘటనలను తగ్గిచేందుకు ఎడిటింగ్ ఫీచర్లను డిజైబుల్ చేశారు. గతంలో పోస్టు చేసిన మెసేజ్‌లను ఎడిట్ చేసి ఆప్షన్ ప్రస్తుతం 30వ తేదీ వరకు బ్లాక్ చేశారు. పేపర్ లీకేజీలకు పాల్పడుతున్న చీటింగ్ ముఠాలు టెలిగ్రాం యాప్‌ను విరివిగా వాడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. నీట్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులను ఆ చీటింగ్ ముఠా టార్గెట్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. పేపర్ లీకేలకు చెందిన అనేక ఛానళ్లను, గ్రూపులను ఇప్పటికే ప్రభుత్వం తొలగించింది.

# హర్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

మొదటి తరువాయి

అవగాహన ఒప్పందం పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తానని.. దీనిపై ప్రత్యేకంగా మీడియా సమావేశం కూడా నిర్వహిస్తానని తెలిపారు.

ఇరాన్‌తో కుదిరిన ఈ ఒప్పందాన్ని అమెరికా కాంగ్రెస్ పరిశీలనకు పంపనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ ఒప్పందంలో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోదని స్పష్టంగా పేర్కొన్నామని వెల్లడించారు. ఇరాన్‌తో చర్చల తొలి దశ విజయవంతంగా పూర్తైందని.. రెండో దశ చర్చలు మరింత వేగంగా పూర్తవు తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన పూర్తి పాఠ్యాన్ని అధికారిక కార్యక్రమంలో విడుదల చేస్తానని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన శాంతి ఒప్పందం ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి పునఃప్రారంభం ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఊరటనివ్వనుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాతో ఒప్పందం అనంతరం ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు మళ్లీ సముద్ర మార్గంలో ప్రయాణాలు ప్రారంభించాయని వెల్లడించింది. అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనం సడలింపుకు ఇది సంకేతమని పేర్కొంది. ప్రస్తుతం మూడు ఇరానియన్ చమురు ట్యాంకర్లు ఉత్తర హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా.. మరో రెండు నౌకలు అవసరమైన సరుకులు, పశువుల మేతతో దక్షిణ ఇరాన్ నౌకాశ్రయాల వైపు వెళ్తున్నాయని ఇరాన్ మీడియా తెలిపింది. ఏప్రిల్ 13 నుంచి అమల్లో ఉన్న అమెరికా నౌకాదళ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే తాజా ఒప్పందంతో ఆ దిగ్బంధనాన్ని ఎత్తివేసే పక్రియ అమలులోకి వచ్చిందని ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామం ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అన్నలు' లేరని అలుసుగా తీసుకుంటే ఖబర్దార్!

మొదటి తరువాయి



కూడా కల్పించకుండా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. అడవిలో అన్నలు లేరని సింగరేణి యాజమాన్యం కార్మికులను వేధిస్తోందన్నారు. అన్నలు తమ పార్టీలో కూడా ఉన్నారన్నారు. కార్మికులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే.. ఊరుకునే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. కవిత మాట్లాడుతూ.. 'గతంలో రాహుల్, రేవంత్, భట్టి సింగరేణిలో పర్యటించలేదా? కార్మికుల సమస్యలు తెలుసుకుంటే తప్పేంటి?. పోలీసులను పెట్టుకుని ఎన్నిరోజులు అధికారంలో ఉంటారు?. కార్మికుల సమస్యలపై టీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుంది' అని అన్నారు. ఈ సందర్భంగా మావోయిస్టులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అడవిలో అన్నలు ఉంటే.. అప్పట్లో ఇక్కడ ధైర్యం ఉండేది. సింగరేణి అధికారులు పద్ధతిగా పనిచేసేవారు. అడవిలో అన్నలు లేరని, అడిగే దిక్కులేదని.. సింగరేణి యాజమాన్యం అనుకుంటోంది. కానీ, అడవిలో అన్నలందరూ ఇప్పుడు టీఆర్ఎస్‌లోనే ఉన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే వెంటాడుతాం అని అన్నారు.

# రాహుల్‌కి నిజాయితీ లేదు

మొదటి తరువాయి



ఎన్నికల సమయంలో తమ మిత్రపక్షాల మద్దతును కోరే కాంగ్రెస్, రాష్ట్ర స్థాయి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం తరచుగా వాటిని బలహీనపరిచేలా వ్యవహరిస్తుందని డీఎంకే 'మురసోలి'లో విమర్శించింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ప్రతి రాష్ట్రంలోనూ, ఇండియా బ్లాక్‌లోని తమ భాగస్వామ్య పక్షాలు అధికారంలోకి రాకుండా అడ్డుకోవడానికి కాంగ్రెస్ సాధ్యమైనదంతా చేసింది. అయినప్పటికీ పార్లమెంటు ఎన్నికలు వచ్చినప్పుడు మళ్లీ బిజెపికి వ్యతిరేకంగా పోరాడడం అనే పేరుతో భాగస్వామ్య పక్షాల మద్దతును కోరుతుంది అని మురసోలి పత్రిక వెల్లడించింది. కాగా, ఈ సందర్భంగా రాహుల్‌గాంధీనుద్దేశించి డిఎంకె తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యతపై చర్చించేందుకు ఇటీవల ఏర్పాటు చేసిన ఇండియా బ్లాక్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీయే ప్రధాన విమర్శలకు గురైంది. దీనికి రాహుల్ గాంధీ రాజకీయ పరిణితి లేకపోవడమే, ఆయన నిజాయితీ లేని వైఖరే కారణం అని డీఎంకే అధికారిక పత్రిక పేర్కొంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తర్వాత కాంగ్రెస్ ప్లేటు ఫిరాయించింది. అప్పటివరకు ఇండియా బ్లాక్‌లో డిఎంకెతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్, ఫలితాల అనంతరం డిఎంకెతో చెప్పాపెట్టకుండా.. టివికెకి మద్దతు ఇచ్చి ఆ పార్టీ వైపు వెళ్లింది. దీంతో డిఎంకె కాంగ్రెస్ వైఖరి పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉంది. ?వెంటనే కాంగ్రెస్‌తో ఇక ఎప్పటికీ పొత్తు పెట్టుకోమని అని వెల్లడించింది.

# సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

మొదటి తరువాయి



భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.

వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కేసీఆర్ హయాంలో స్కీములు..
# కాంగ్రెస్‌లో స్కాములు

మొదటి తరువాయి

కరీంనగర్ జిల్లా అల్గునూర్ లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి డిజిటల్ సభ్యత్వ నమోదు తో పాటు సర్ పై విస్తృత స్థాయి సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ రావుకు అల్గునూర్ లో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పని కేసీఆర్ ప్రభుత్వంలో రైతు బంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మి లాంటి స్కీంలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తే సివిల్ సప్లైలో, సింగరేణిలో, హామ్ రోడ్లలో, పిల్లలకు అన్నం పెట్టే గుడ్లలో, బట్టలలో స్కాంలు రేవంత్ సర్కాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రూ.12వేలు ఇవ్వడం లేదని, మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న రేవంత్ కుటుంబం కోటీశ్వరులు అవుతున్నారని విమర్శించారు. జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ సంక్షేమ మంత్రులకు తెలియకుండా స్కాంలు జరుగుతున్నాయని, జిల్లా పరువు పోతుందని, రూ.2వేల కోట్ల స్కాం జరిగినా వారికి తెలియలేదని, ఇందులో ఎనుమల వారిదే రాజ్యం నడుస్తోందన్నారు. పతకాల అమలుకు ఖజానా లేదంటున్న రేవంత్ ఫుట్ బాల్ ఆటకి, అందాల పోటీలకు, వాస్తు పేరుతో సచివాలయ పనులకు, పలుచోట్ల క్యాంపు ఆఫీసులకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నాడని, ఆయనకు రైతులు, మహిళల పట్ల, పేదల పట్ల మనస్సు లేదని విమర్శించారు. మన సొమ్మును ఇతర రాష్టాల్లో ప్రకటనలకు, ఎన్నికలకు, ఢిల్లీకి పంపిస్తున్నాడని ఆరోపించారు. కమీషన్లు రావని పేదల పథకాలు అమలు చేయడం లేదని, కమీషన్లు వచ్చే పనులను రేవంత్ చేపడుతున్నాడని విమర్శించారు. ఓట్లు పెట్టి దేవుణ్ణి మోసం చేసిన ఎగువేతల రేవంత్ రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగులను, రైతులను. మోసం చేస్తున్నాడని అన్నారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున్న కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు.

# బీజేపీకి లబ్ధి చేకూర్చేలా 'సార్' ప్రక్రియ

మొదటి తరువాయి



అలాంటి దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ పక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ ఓనమాలు నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ దేశంలో అతికొద్దిమంది నిజాయితీ పరుల్లో మీనాక్షి నటరాజన్ ఒకరని పేర్కొన్నారు. అకారణంతోనే ఆమె రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించారని తెలిపారు. బీజేపీ వాళ్లకి కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల్లా ఉండాలని బీజేపీ నేతలు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మీ కంటే పెద్ద చక్రవర్తులే నేలమట్టం అయ్యారు.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఎంత..? అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం అనుకుంటే.. వారు మూర్ఖులే అవుతారన్నారు. దేవుళ్లకు ఎవరు వ్యతిరేకం కాదు.. కానీ దేవుడి పేరు చెప్పనిదే బీజేపీ వాళ్లకు ఓట్లు పడవన్నారు.

ఏడాదిలో చాలాసార్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూజలు నిర్వహిస్తారని.. కానీ దేవుళ్ల పేరుతో తాము ఓట్లు అడిగమన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని.. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారంటూ కేంద్రంపై టీపీసీసీ చీఫ్ నిప్పులు చెరిగారు. ఇకపోతే జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఉందని టీపీసీసీ చీఫ్ విమర్శించారు. కమలం పార్టీ ఆడించినట్టే.. ఆయన ఆడుతున్నారని ఆరోపించారు. మీ సానుభూతి తమకేం అవసరం లేదని పవన్‌కు స్పష్టం చేశారు. మీ కుట్రలు ప్రజలు గమనిస్తున్నారని పవన్‌కు సూచించారు. తెలంగాణ వచ్చినప్పుడు 10 రోజులు అన్నం తినలేదని పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో చిట్టా ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. కేంద్రం నుంచి రాష్టానికి ఇంకా నిధులు రావాల్సి ఉందన్నారు. విభజన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మీరు సబర్మతి కట్టుకో వచ్చు.. తాము మూసి ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరని అసహనం వ్యక్తం చేశారు. వీటికి సమాధానం చెప్పాలంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్పష్టం చేశారు. ఓ వైపు బీజేపీ, మరో వైపు బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చీఫ్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.

## ద్రోణి ప్రభావంతో
# రాష్ట్రావ్యాప్తంగా వర్షాలు

మొదటి తరువాయి

జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఎండ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# అమెరికాలో కూలిన బీ-52 బాంబర్ విమానం..

మొదటి తరువాయి



బాంబర్ కూలిన తర్వాత ఆ ప్రాంతం నుంచి దట్టమైన నల్లటి పొగ కమ్ముకున్నది. బీ52 విమానానికి చెందిన ఎటువంటి ఆధారాలు కూడా లేకుండా కాలిపోయాయి. ప్రభుత్వ కాంట్రాక్టర్లు, మిలిటరీ సిబ్బంది ఆ విమానంలో ఉన్నారు.

ఫూటేజ్ పరిశీలించిన తర్వాత ఏ ఒక్కరు కూడా బ్రతికి ఉన్నట్లు తెలియడం లేదని కల్నల్ జేమ్స్ హేస్ తెలిపారు. 8 మంది గొప్ప అమెరికన్లు మృతిచెందారని, వారి కుటుంబాలకు ఈ విషయాన్ని చేరవేస్తున్నట్లు హేస్ చెప్పారు. ఏ కారణం చేత ప్రమాదం జరిగిందో ఇంకా నిర్ధారించలేదు. దర్యాప్తు పూర్తి కావడానికి సుమారు ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నది. రేడార్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్‌లో ఆ బీ-52 బాంబర్ పాల్గొన్నట్లు తెలుస్తోంది. బోయింగ్ బీ-52 స్ట్రాటోఫోర్ట్రెస్ లాంగ్ రేంజ్ బాంబర్.. 1955లో సర్వీస్‌లోకి వచ్చింది. సంప్రదాయ, అణ్వాయుధాలను మోసుకెళ్లే రీతిలో దీన్ని డిజైన్ చేశారు. ఈ బాంబర్ విమానాన్ని వియత్నాం నుంచి తాజా ఇరానీ యుద్ధం వరకు అమెరికా వాడింది. లాస్ ఏంజిల్స్‌కు 141 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎడ్వర్డ్స్ ఎయిర్ బేస్‌లో ఎక్కువ శాతం విమానాల టెస్టింగ్ నిర్వహిస్తుంటారు. ఎయిర్ ఫోర్స్ విమానాలు, వెపన్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్‌ను పరీక్షిస్తుంటారు. 412 టెస్ట్ వింగ్ ఇక్కడ పనిచేస్తుంది. టేకాఫ్ తీసుకున్న తర్వాత ఎక్కువ ఎత్తుకు కానీ ఎక్కువ దూరానికి కానీ వెళ్ల లేదని, అంటే ఫ్లయిట్ కంట్రోల్‌లో సమస్య వచ్చి ఉంటుందని నిపుణుడు జెఫ్ గుజెట్టి తెలిపారు.

# పారదర్శకంగా యూరియా పంపిణీ

మొదటి తరువాయి



టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు వెళ్లాలని రైతులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు.

# నైరుతి కనుమరుగైందా?!..

**దేశమంతటా విస్తరించినా..**

**వానలు అంతంత మాత్రమే**



**న్యూఢిల్లీ జూన్ 16 జర్నలిస్టు డైరీ**
సూపర్ ఎల్‌నిలో ఎఫెక్ట్‌తో ఇప్పటికే ఆలస్యమైన 'నైరుతి' ఉన్నట్టుండి కనుమరుగయ్యిందా? దేశమంతటా రుతు పవనాలు విస్తరించినప్పటికీ, వానలు లేకపోవడానికి కారణమేంటీ? భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం విడుదల చేసిన తాజా ఉపగ్రహ చిత్రాలు ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాయి. City & Local Guides దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు ఇప్పటికే విస్తరించిన నైరుతి రుతుపవనాలు.. ఉపగ్రహ చిత్రాల్లో ఉన్నట్టుండి కనుమరుగయ్యినట్టు ఐఎండీ పేర్కొంది. ఈ కారణంగానే ఈ నెల 4వ తేదీ నుంచి సోమవారం వరకూ దేశవ్యాప్తంగా సగటున 53.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైనట్టు వెల్లడించింది. లోటువర్షపాతం 64 శాతంగా రికార్డయ్యినట్టు వివరించింది.

**ఎందుకు ఇలా?**
దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ, సమృద్ధిగా వానలు లేకపోవడానికి తూర్పు-పశ్చిమ పవనాలు ఢీకొనడమే కారణమని ఐఎండీ తెలిపింది. తూర్పు నుంచి వచ్చే పవనాలు (ఈస్టర్లీ జెట్) మేఘాలను తాకడం వల్ల నైరుతి సమయంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. భూ ఉపరితలానికి 15 కిలోమీటర్ల ఎత్తులో ఈ ప్రక్రియ జరుగుతుంది. అయితే, ఉన్నట్టుండి పశ్చిమం దిశ నుంచి అత్యంత వేగంగా వచ్చిన పవనాలు (వెస్టర్లీ జెట్ స్ట్రీమ్) ఈస్టర్లీ జెట్‌ను ఢీకొట్టడంతో మేఘాలు ఏర్పడటం ఆగిపోయిందని, ఈ కారణంగానే సరైన వానలు పడట్లేదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

**వారంలో సర్దుబాటు**
నైరుతి ప్రవేశించి పది రోజులు గడుస్తున్నప్పటికీ, దేశంలో సగం కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఇంకా లోటు వర్షపాతమే నమోదైనట్టు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నైరుతిలో ఈ స్తబ్దత మరో వారం పాటు కొనసాగే అవకాశం ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. పరిస్థితుల్లో మార్పులు జరిగి 22వ తేదీ నాటికి వానలు సాధారణ స్థితికి చేరవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆస్ట్రేలియాకు చెందిన తొమ్మిదేళ్ల బాలికను కాల్చి చంపిన పాక్ పోలీసులు



**న్యూఢిల్లీ జూన్ 16 జర్నలిస్టు డైరీ**
పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌లో పోలీసు అధికారి పొరపాటున జరిపిన కాల్పుల్లో ఆస్ట్రేలియాకు చెందిన 9 ఏళ్ల బాలిక హానియా మృతిచెందింది. దొంగతనం కేసులో అనుమానితులను వెంబడిస్తున్న క్రమంలో, పారిపోతున్న కుటుంబ వాహనాన్ని అడ్డగించే ప్రయత్నంలో అధికారి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో బాలికతో పాటు ఆమె తండ్రి, సోదరుడు గాయపడ్డారు. ఆస్ట్రేలియా ప్రధాని విచారం వ్యక్తం చేస్తూ, పారదర్శక విచారణకు ఆదేశించారు. గాయపడిన వారికి ఆస్ట్రేలియా కాన్సులేట్ సహాయం అందిస్తోంది.

# అణ్వాయుధాలు వదులుకునేందుకు ఇరాన్ అంగీకరించింది:



**న్యూయార్క్ జూన్ 16 జర్నలిస్టు డైరీ**
అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. అయితే అణ్వాయుధాలను కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించినట్లు సోమవారం డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇక తమ శాంతి ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు 300 మిలియన్ల డాలర్ల ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో స్పందించారు. ఇరాన్‌తో కుదిరే డీల్‌లో.. అణ్వస్త్రాలను డెవలప్ చేయబోమని ఆ దేశం అంగీకరించనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య ఎంవోయూ కుదిరినట్లు వార్తలు వెలుబడుతున్న విషయం తెలిసిందే. జెనీవాలో శుక్రవారం అధికారికంగా రెండు దేశాల మధ్య సంతకాలు జరిగే అవకాశం ఉన్నది.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి రోజు నుంచి స్పష్టంగా ఉన్నారని, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండబోదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అణ్వాయుధ సేకరణ కోసం ఇరాన్‌కు అనుమతి ఇవ్వబోమని ఇజ్రాయల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ కూడా స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండవద్దు అని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానని, దీన్ని జీవిత మిషన్‌గా భావించానని అన్నారు. డీల్ కుదిరినా, కుదరకపోయినా, ఇరాన్ వద్ద న్యూక్లియర్ వెపన్ ఉండబోదన్నారు. ఇజ్రాయెల్ ప్రధానిగా తాను ఉన్నంత కాలం ఇలా జరగబోదన్నారు.

# డిజిటల్ మోసాలు రెట్టింపు..!

**ప్రపంచ సగటుతో పోల్చితే**

**భారత్ లో ఆందోళనకరం**

**ట్రాన్స్ యూనియన్ వెల్లడి**




**న్యూఢిల్లీ జూన్ 16 జర్నలిస్టు డైరీ**
దేశంలో డిజిటల్ లావాదేవీలు ఏటా రికార్డు స్థాయిలో విస్తరిస్తున్నప్పటికీ అదే వేగంతో సైబర్ నేరగాళ్లు కూడా విరుచుకుపడుతున్నారు. అంతర్జాతీయ క్రెడిట్ బ్యూరో సంస్థ ట్రాన్స్‌యూనియన్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో డిజిటల్ మోసాల ముప్పు దాదాపు రెట్టింపు స్థాయిలో పొంచి ఉంది. గడిచిన ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన డిజిటల్ లావాదేవీలలో అనుమానాస్పద మోసాల సగటు 3.8 శాతంగా నమోదైతే.. భారత్‌లో ఈ రేటు ఏకంగా 7.1 శాతానికి చేరి ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వేగవంతమైన వృద్ధిని కనబరుస్తున్న లాజిస్టిక్స్, టెలికాం, మరియు ఇన్సూరెన్స్ రంగాలు ఈ సైబర్ మోసగాళ్ల ప్రధాన లక్ష్యంగా మారుతు న్నాయి. ?పరిశ్రమల వారీగా ఈ డేటాను పరిశీలిస్తే.. కొరియర్, రవాణా సేవలు అందించే లాజిస్టిక్స్ రంగం 16.3 శాతం అనుమానాస్పద మోసాల రేటుతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో టెలికాం రంగం 14.7 శాతంతో, బీమా రంగం 11.5 శాతంతో తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ నిర్దిష్ట రంగాలు వెంటవెంటనే జరిగే లావాదేవీలపై, విస్తృతమైన డిస్ట్రిబ్యూటెడ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడి పనిచేస్తుండటమే సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోంది. వినియోగదారుల గుర్తింపును సరిచూసే ప్రక్రియల్లో, అథెంటికేషన్ వ్యవస్థల్లో ఉన్న సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు ఈ రంగాల ఖాతాల్లోకి సులభంగా చొరబడుతున్నారు. ?అయితే అంతర్జాతీయ ట్రెండ్‌తో పోలిస్తే భారత్‌లో సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న వ్యూహం పూర్తి భిన్నంగా ఉందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా కొత్త అకౌంట్లు తెరిచేటప్పుడు మోసాలు ఎక్కువగా జరుగుతుంటే.. భారత్‌లో మాత్రం ఇప్పటికే చలామణిలో ఉన్న వినియోగదారుల ఖాతాల్లోకి లాగిన్ అయ్యే సమయంలోనే గరిష్టంగా 3.9 శాతం మోసాలు జరుగుతున్నాయి. వ్యాపార సంస్థలు, వినియోగదారులు లాగిన్ దశల్లో తమ భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూశాకే షాపింగ్..

**- జెన్‌జీ అలవాట్లపై సంచలన నివేదిక**



**న్యూఢిల్లీ జూన్ 16 జర్నలిస్టు డైరీ**
ఒకప్పుడు కొత్త దుస్తులు, బ్యూటీ ప్రొడక్ట్‌లు, ఫ్యాషన్ బ్రాండ్ల గురించి తెలుసుకోవాలంటే స్నేహితులు, కుటుంబసభ్యులను అడిగేవారు. లేదంటే ప్రకటనలను చూసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా జెన్‌జీ యువత ఏ వస్తువును కొనుగోలు చేయాలన్నా ముందుగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌నే చూస్తున్నారు. సోషల్‌మీడియాలో పోస్టులను చూసిన తర్వాతనే ఏ ప్రొడక్ట్ అయినా కొనాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటున్నట్లుగా తాజా అధ్యయనంలో వెల్లడైంది. సోషల్ మీడియా దిగ్గజం మెటా నిర్వహించిన తాజా పరిశోధన ప్రకారం.. దేశంలోని 23 నగరాల్లో 4 వేల మందికిపైగా వినియోగదారులపై ఈ అధ్యయనం నిర్వహించారు. ఫలితాల్లో బ్యూటీ, ఫ్యాషన్‌కు సంబంధించి వీడియోలకు అత్యధిక రెస్పాన్స్ వస్తున్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో అత్యధికంగా బ్యూటీ, మేకప్, ఫ్యాషన్, ఫిట్‌నెస్‌కు సంబంధించిన కంటెంట్‌నే ఎక్కువగా చూస్తున్నారని తెలిసింది. ఈ అధ్యయనం ప్రకారం సుమారు 52 శాతం మంది వినియోగదారులు బ్యూటీ, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్‌కు సంబంధించిన రీల్స్‌ను తరచచూ చూస్తున్నామని తెలిపారు. ఇన్‌ఫ్లూయెన్సర్లు బ్రాండ్ ఉత్పత్తులపై రివ్యూలు ఇవ్వడం, కొత్త బ్రాండ్లను పరిచయం చేయడం, వారి అనుభవాలను పంచుకోవడం వంటి అంశాలు ప్రేక్షకులను ఎక్కువగా ఆకర్షిస్తున్నట్లు నివేదికలో తెలిసింది. ఈ అధ్యయనంలో మరో ఆసక్తికర అంశం కూడా వెలుగులోకి వచ్చింది. రీల్స్ వీక్షణలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసం గణనీయంగా తగ్గిపోయినట్లు పరిశోధకులు గుర్తించారు. పట్టణ ప్రాంతాల్లో 98 శాతం మంది వినియోగదారులు ప్రతిరోజూ వీడియోలు చూస్తుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 94 శాతంగా నమోదైంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. గ్రామీణ ప్రాంతాల వినియోగదారులు కూడా పట్టణ ప్రాంతాలవారు ఇష్టపడే అదే తరహా కంటెంట్‌ను వీక్షిస్తున్నారు. అంటే డిజిటల్ వినియోగంలో నగరాలు, గ్రామాల మధ్య ఉన్న అంతరం క్రమంగా తగ్గుతున్నట్లు స్పష్టమవుతుంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను కేవలం వినోదంగా భావించినప్పటికీ.. అవి యూజర్ల కొనుగోలు అలవాట్లను కూడా ప్రభావితం చేస్తున్నాయి. కొత్త ఉత్పత్తి లేదా బ్రాండ్ గురించి తెలుసుకోవడానికి చాలామంది ముందుగా రీల్స్‌ను ఆశ్రయిస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. అధ్యయనం ప్రకారం.. 81 శాతం మంది యూజర్లు కొత్త ఉత్పత్తి లేదా బ్రాండ్ గురించి తొలిసారిగా రీల్స్ ద్వారానే తెలుసుకున్నట్లు తెలిపారు. అలాగే 66 శాతం మంది ఏ వస్తువునైనా కొనే ముందు రీల్స్‌లో అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇక 47 శాతం మంది తుది కొనుగోలు నిర్ణయంపై కూడా రీల్స్ ప్రత్యక్ష ప్రభావం చూపినట్లు అంగీకరించారు.

# డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే దగ్గు సిరప్‌లు..

**◻ కేంద్రం కఠిన ఆదేశాలు**



**న్యూఢిలీ జూన్ 16 జర్నలిస్టు డైరీ**
దగ్గు సిరప్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని కేంద్రం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో నోటీఫికేషన్ జారీ చేసింది. 1945 నాటి డ్రగ్ రూల్స్ లోనూ సవరణలు చేశారు. తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి సుమారు 20 మంది చిన్నారులు మృతిచెందారు. అయితే ఆ ఘటన పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ తయారీకి చెందిన దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో తన హెచ్చరికల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. 2026 డ్రగ్స్ రూల్స్‌ను కేంద్రం నోటిఫై చేసింది. పాత చట్టానికి సవరణలు చేశారు. షెడ్యూల్ కేలో భాగంగా సిరప్ పదాన్ని ఆ కేటగిరీ నుంచి తొలగించారు. డ్రగ్స్ యాక్ట్ 1940 ప్రకారం ఆ కేటగిరీలో కొన్ని మందుల తయారీ, సరఫరా, అమ్మకాలపై నిషేధం మినహాయింపు ఇస్తారు. షెడ్యూల్ కేలో ఉన్న డ్రగ్స్‌ను ఎటువంటి లైసెన్సు లేకుండానే అమ్ముకోవచ్చు. ఇంటి చిట్కాలుగా భావిస్తూ ఆస్పరిన్, పారాసిటమాల్, అనల్జసిక్ బామ్స్ లాంటి కొన్ని మందులు అమ్ముకునేందుకు వీలు ఉంది. అయితే ఇప్పుడు ఆ షెడ్యూల్ నుంచి సిరప్ అనే పదాన్ని తొలగించారు. దగ్గు కోసం వాడే సిరప్‌లు, లాజెంజిస్, పిల్స్, ట్యాబ్‌లెట్లు కూడా అందులో ఉన్నాయి. ప్రభుత్వం అధికారిక గెజిట్ ప్రచురించడం వల్ల కొత్తగా చేపట్టిన సవరణ అమలులోకి వచ్చేస్తుంది.

# ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి నలుగురు సైనికులకు గాయాలు..

**-సాధారణ తనిఖీ నిర్వహిస్తుండగా పేలుడు**



**న్యూఢిల్లీ జూన్ 16 జర్నలిస్టు డైరీ**
జమ్మూ కాశ్మీర్‌లో విషాదం జరిగింది. సాధారణ గస్తీ, తనిఖీ నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి నలుగురు సైనికులు గాయపడ్డారు. ఈ ఘటన జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరి జిల్లా, నౌషేరా సెక్టార్ పరిధిలో మంగళవారం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమావోన్ రెజిమెంట్ యూనిట్‌కు చెందిన సైనికులు సాధారణ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక మల్టీ మోడ్ గ్రెనేడ్ ప్రమాదవశాత్తు పేలిపోయింది. ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న నలుగురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురు సైనికులతోపాటు ఒక జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో) కూడా ఉన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఉన్నతాధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డవారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స కొనసాగుతోంది. వారి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. వారంలో ఇది రెండో ఘటన. సాధారణంగా ఆర్మీ సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో గస్తీ, నిఘా నిర్వహిస్తుంటారు. నిరంతరం సరిహద్దులో ఈ తరహా తనిఖీలు అక్కడ మామూలే. పైగా రాజౌరి జిల్లాలోని ఘటన జరిగిన ప్రాంతం చాలా సున్నితం కావడంతో కొన్ని ఆయుధాలతో తనిఖీ చేస్తుండగా పేలుడు సంభవించింది. కొన్నిసార్లు ప్రమాదవశాత్తు ఆయుధాలు పేలు సైనికులు మరణించిన ఘటనలు జరుగుతున్నాయి. గత వారం కూడా బారాముల్లా జిల్లాలోని యురి సెక్టార్‌లో ప్రమాదవశాత్తు ఒక గ్రెనేడ్ పేలింది. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిచగా, అప్పటికే సైనికులు మరణించినట్లు వైద్యులు తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# మల్కం చెరువు, దుర్గం చెరువు, గురునాథం చెరువు, గంగారాం చెరువు ఇన్ లెట్ మరియు ఔట్ లెట్ లను అధికారులతో కలిసి పరిశీలించిన గాంధీ





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 16 (జర్నలిస్ట్ డైరీ) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మల్కం చెరువు, దుర్గం చెరువు, గురునాథం చెరువు, గంగారాం చెరువు ఇన్ లెట్ మరియు ఔట్ లెట్ లను, బయో డైవర్సిటీ జంక్షన్, కొత్తగూడా సంతోష్ డాబా, నెక్టర్ గార్డెన్ ,జూబ్లీ గార్డెన్ మరియు వాటర్ లాగింగ్ పాయింట్ల సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి . ఆనంద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ (తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకార సమాఖ్య) చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, సిఎంసి కమిషనర్ సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సిపి) రీ రమేష్ రెడ్డి, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డీసీపీ శ్రీ చింతమనేని శ్రీనివాస్, డీసీపీ రీతి రాజ్, బాలకృష్ణ, డీసీ శ్రీమతి శశిరేఖ, సిఎంసి ఇంజనీరింగ్ విభాగం మరియు ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ విభాగం, ట్రాఫిక్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం మరియు ఇరిగేషన్ విభాగం అధికారుల తో కలిసి పరిశీలించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, సమిష్టి కృషి తో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని,సమస్యతమకమైన, లోతట్టు వర్షపు నీటి నిల్వ ప్రాంతల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని



, వాటర్ లాగింగ్ పాయింట్ల పై శాశ్వత పరిష్కారం త్వరలోనే చూపుతామని, ఇన్ లెట్ సరిగ్గా లేకపోవడం వలన,కుంచించుకోపోవడం వలన, చెత్త చెదరం వచ్చి చేరడం వలన కాలనీ లో మురుగు సమస్య తీవ్రమైనది అని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, వరద నీరు సాఫీగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని , ఇన్ లెట్ ను సరి చేసి డ్రైనేజి సమస్య ను త్వరితగతిన పరిష్కరించాలని, కాలనీల వాసులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియచేసారు. వర్షాకాలంలో కాలనీలు ముంపుకు గురి కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, వరద నీరు సాఫీగా సాగేలా చూడలని, ముంపు వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని , దీనికి శాశ్వత పరిష్కారంగా ఇన్ లెట్ సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడలని, డ్రైనేజి మ్యాన్ హోల్ ల ను మరమ్మత్తులను చేపట్టి ఇబ్బంది లేకుండా చూడలని, మళ్లి పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ,ఎయిర్ టెక్ మిషన్ ద్వారా ప్రతి మ్యాన్ హోల్ లో చెత్త చెదారం లేకుండా పూడిక తీసి, నీటి ప్రవాహం సాఫీగా సాగేల చూడలని , అవసరమున్న చోట మ్యాన్ హెల్స్ ను మరమ్మత్తులు చెపట్టి అందుబాటులో కి తీసుకోవాలని అధికారులకు తెలియచేసారు.

ప్రతి చెరువు కు వెళ్లే ఇన్ లెట్ లను మరియు ఔట్ లెట్ ల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని , ఇన్ లెట్ లో చెత్త చెదారం పెరుకపోకుండా ,వర్షపు నీరు సాఫీగా సాగేలా చూడలని, నాలల పై అక్రమ నిర్మాణాలను తొలగించాలని, నాలలు ఎవరైనా అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ,నాలలను అక్రమిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు అని , పూర్తి స్థాయిలో నాలల ప్రక్షాళన జరగాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన నాలలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలియచేసారు

కాలనీల వాసులకు, ప్రజలకు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని,ఏ చిన్న సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానాని, ప్రతి కాలనీ లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అగ్రగామి నియోజకవర్గం గా తీర్చిదిద్దుతామని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, జవీజ ఇంజనీరింగ్, ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్, ట్రాఫిక్, టౌన్ ప్లానింగ్ విభాగం మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కృషి

## -ఇప్పటికే సొంత భవనం నిర్మాణం చేసి ఇచ్చాం
## -మందుముల పరమేశ్వర్ రెడ్డి



**నాగారం, జూన్ 16:-(జర్నలిస్ట్ డైరీ)** సీనియర్ సిటిజన్స్ సంక్షేమం, అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తున్నారని గుర్తు చేశారు. ఉప్పల్ గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు.సీనియర్ సిటిజన్స్ కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఉప్పల్ లో ఉన్న సీనియర్ సిటిజన్స్ కోసం స్థలాన్ని కేటాయించడంతో పాటు భవనాన్ని సైతం నిర్మాణం చేసి ఇచ్చామన్నారు. రానున్న కాలంలో సీనియర్ సిటిజన్స్ కోసం పని చేసేందుకు, అన్ని వేళల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, ఉపాధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, మనోహర్, సంయుక్త కార్యదర్శిలు నరసింహారెడ్డి, లింగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు విజయ రావు, సల్ల మల్లారెడ్డి, సలహాదారు, మేకల వెంక రెడ్డి, షమీర్పేట్ యాది రెడ్డి, షమీర్పేట్ ధర్మ రెడ్డి, గోనె ప్రభాకర్ రెడ్డి, గోనె అర్జున్ రెడ్డి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ రావు, మెంబర్స్, మందుముల అంజి రెడ్డి, లక్ష్మీనరసయ్య, పాండురంగమ్మ, వీరేశం, కుమార స్వామి, రామయ్య గౌడ్, ఐలయ్య, స్నేహ, కృష్ణారెడ్డి, బుచ్చి రెడ్డి, బిక్షపతి, రఘురామయ్య, నారాయణ, పాపి రెడ్డి, సత్యనారాయణ, రామ్ రెడ్డి, వెంకటేశ్వర్, వెంకటమ్మ, సుశీల, సంధ్య రేఖ, శ్రీవాణి, ఇందిరా, స్వరూపారాణి, అనసూయ, సల్ల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, మంద మురళి కృష్ణారెడ్డి, బజార్ నవీన్, ప్రశాంత్ రెడ్డి, రంగుల శేఖర్, పాల్గొన్నారు.

# వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ తెలంగాణ ఓపెన్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్-2026

## - పాల్గొన్న నెమలి అనిల్ కుమార్



**నాగారం, జూన్ :-(జర్నలిస్ట్ డైరీ)** మల్లాపూర్ డివిజన్‌లోని జీఎస్ ఫిట్నెస్ స్టూడియోలో నిర్వహించిన వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ కాంగ్రెస్ తెలంగాణ ఓపెన్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ - 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు మరియు మెడల్స్ ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ యువత క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు పట్టుదలను పెంపొందించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ పోటీలను నిర్వాహకులు గౌతమ్ జీఎస్ ఫిట్నెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ కార్పోరేటర్ నెమలి సురేష్ జయంతి



**నాగారం, జూన్ 16:-(జర్నలిస్ట్ డైరీ)** జీహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటి మెంబెర్, దివంగత ప్రజానేత స్వర్గీయ నెమలి సురేష్ 56వ జయంతి సందర్భంగా ఉమ్మడి మల్లాపూర్ స్వామి వివేకానంద నగర్ కాలనీలోని ఆయన విగ్రహం వద్ద జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నెమలి సురేష్ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు ఘన నివాళులు అర్పించారు. ప్రజా సేవకు అంకితభావంతో జీవితాంతం పనిచేసిన సురేషన్న సేవలను నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు స్మరించుకున్నారు. ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలిచి, అందరి మన్ననలు పొందిన అన్నగారి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదనీ కానీ ప్రజల కోసం చేసిన సేవ శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతుందని నెమలి సురేష్ జీవితం ప్రజాసేవకు చిరునామా అని, ఆయన ఆశయ సాధనే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నెమలి రవికుమార్, వీరస్వామి, సీతాల వీరస్వామి, సుధర్శన్, దంతూరి రాజు గౌడ్, సద్గుణరావు, అనిల్ జైన్, మోహన్, కోయలకొండ రాజేష్, నెమలి శ్రావణ్, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, చారి, కాటం గౌడ్, నెమలి సందీప్, వెంకటేశ్వర్లు, షేక్ అన్వర్, విజయ్ రెడ్డి, యాదగిరి, జహంగీర్, సురేష్, నవీన్ అలాగే సూర్యచంద్ర యూత్ క్లబ్ సభ్యులు, అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, వివిధ డివిజన్ల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సురేషన్నకి ఘనంగా నివాళులర్పించారు.

# కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజీత్ దీప్కే పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## - టీజీ శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి, తెలంగాణ విద్యావంతుల వేదిక



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 16 (జర్నలిస్ట్ డైరీ) :** కాక్రూచ్ జనతా పార్టీ యొక్క ప్రధాన డిమాండ్ అయినా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణం రాజీనామా చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక డిమాండ్ చేస్తుంది. నీట్ ప్రశ్న పత్రం లీక్ కారణంగా ఐదు మంది విద్యార్థులు ఆత్మహత్య కారణమైన కేంద్ర విద్యా శాఖ బాధ్యత వహించాలి అని, కేంద్ర విద్యా శాఖ అధిపతి అయినా ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే నైతిక జవాబుతారీతనాన్ని ఈ దేశ ప్రజలకు బాధ్యత వహించాలని కోరుతున్నాము అని తెలంగాణ విద్యావంతుల వేదిక కోశాధికారి టీజీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాక్రూచ్ జనతా పార్టీ అధ్యక్షుడు పై దాడి చేసిన ఇద్దరు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

# 8వ వార్డులో ఘనంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

## - ఆర్టీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం
## - చిన్నారులకు విద్యా శుభారంభం



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 16 (జర్నలిస్ట్ డైరీ):** షాద్‌నగర్ పట్టణంలోని 8వ వార్డుకు చెందిన ఆర్టీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఈరోజు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ బి.ఎస్. సుధీర్, ప్రధానోపాధ్యాయురాలు వి. రజిత ఆధ్వర్యంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శుభారంభం పలికారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ దేవమ్మ, మాధవ చారి, వనజ, ధనలక్ష్మి తదితరులు పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. చిన్నారుల భవిష్యత్తు విద్యా ప్రస్థానానికి నాంది పలికిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

# మియాపూర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ నేడు శంకుస్థాపనలు చేయనున్న గాంధీ.



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 16 (జర్నలిస్ట్ డైరీ) :** మియాపూర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ తేదీ :17.06.2026 బుధవారం నాడు ఉదయం 09 :00 AM గంటల నుండి పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ , తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులతో కలిసి రూ. 1.ఒక్క కోటి 88 ఎనభై ఎనిమిది లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుంది.

మొదటి ప్రారంభోత్సవం,ఉదయం 09.00 AM గంటలకు

1.) ప్రజయ్ షెల్టర్ నుండి మక్త మహబూబ్ పెద్దకుడి చెరువు కల్వర్టు వరకు 68. అరవై ఎనిమిది లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సిసి రోడ్డు నిర్మాణం పనులకు.

2.) జనప్రియ వెస్ట్ సిటీ కాలనీలో రూ.54 యాభై నాలుగు లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సిసి రోడ్డు, మరియు కమ్యూనిటీ హాల్ ఫ్లోరింగ్ నిర్మాణం పనులకు.

3.)బొల్లారం మెయిన్ రోడ్డు నుండి నాగార్జున ఎనక్లేవ్ కాలనీ వరకు రూ.66 అరవై ఆరు లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే కనెక్టివిటీ బిటి రోడ్డు నిర్మాణం పనులకు.కావున మియాపూర్ డివిజన్ ప్రజలు,ప్రజాప్రతినిధులు,కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు,పాత్రికేయ మిత్రులు,నాయకులు,,మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు ప్రతి ఒక్కరు తప్పకుండా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# హనుమంతరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కీసర నాయకులు



**నాగారం, జూన్ 16:-(జర్నలిస్ట్ డైరీ)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు వి హనుమంత్ రావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కీసర మండల సామాజిక సేవా కార్యకర్త, కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు తుడుం శ్రీనివాస్. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బీసీల ముద్దు బిడ్డ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు పేద ప్రజల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు, ఉద్యమాలు, ప్రతి పేద ప్రజల మధ్యలో ఉంటూ మీరు ప్రజాసేవలో ప్రేరణగా నిలిచి, మిగతా ప్రజలకు ఆశాజ్యోతి గా వెలుగునిచ్చే విధంగా అత్యంత ఉత్తమ ఆరోగ్యం, ఆనందం, విజయాలు కలగాలని మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# చెరువులో ముగ్గురు గల్లంతు...

## - మృత దేహాల కోసం గాలింపు..





**నాగారం, జూన్ 16:-(జర్నలిస్ట్ డైరీ)**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా తిమ్మాయిపల్లి చెరువులో ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగారు. ఈ ఘటనలో కెవిన్ ఆంటోనీ మృతి చెందగా, మరో యువకుడు వాలెంటైన్ టోనీ గల్లంతయ్యాడు. డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా, కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సర్దార్ పటేల్ నగర్‌లో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి....

**నాగారం, జూన్ 16:-(జర్నలిస్ట్ డైరీ)**
మల్కాజ్‌గిరి 183 డివిజన్ పరిధిలోని ఎస్పీ నగర్ (సర్దార్ పటేల్ నగర్) నివాస ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని ఎస్పీ నగర్ బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు, మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్ కి, అలాగే డిప్యూటీ కమిషనర్ కి మంగళవారం వారి కార్యాలయాల్లో కలిసి వినతి పత్రం అందజేసారు.ఈ సందర్భంగా జి.డి. సంపత్ గౌడ్ మాట్లాడుతూ నివాస గృహాల మధ్య జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఈ సెల్ టవర్‌ను నిర్మించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతాలలో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల వెలువడే రేడియేషన్ కారణంగా భవిష్యత్తులో ప్రజలు, ముఖ్యంగా చిన్న పిల్లలు మరియు వృద్ధులు తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న ఈ టవర్ల వల్ల



భవిష్యత్తులో బస్తీ వాసులకు తీవ్ర అసౌకర్యం, ప్రాణాపాయం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను పణంగా పెట్టి నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మిస్తున్న ఈ అక్రమ సెల్ టవర్ పనులను తక్షణమే నిలిపివేయాలని, దానికి సంబంధించిన అనుమతులను రద్దు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. దీనికి స్పందించిన జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ లు ఈ విషయంపై తక్షణమే విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జీడి చరణ్జీత్ గౌడ్, డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గౌసుదిన్ భాయ్, రవీంద్ర రెడ్డి, జీవన్వీ సతీష్, ఎగొండ చారి, దాస్, అసిమ్, శారద, గణేష్, రవీందర్, కుమార్ గౌడ్, పార్థసారథి, అమర్ మరియు పెద్ద సంఖ్యలో బస్తీ మహిళలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీలో భారీగా పదవులు..

**-ఉప్పల్ నియోజకవర్గం 12 మందికి స్థానం**
**-పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపిన పరమేశ్వర్‌రెడ్డి**

**నాగారం, జూన్ 16:-(జర్నలిస్ట్ డైరీ)**
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీలో ఉప్పల్ నియోజకవర్గంలోని 12 మందికి స్థానం దక్కింది. ఈమేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ కమిటీలో స్థానం కలిపిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గం నుంచి జిల్లా కమిటీలో పెద్ద సంఖ్యలో అవకాశం కల్పించినందుకు టీజీపీసీసీ ఛీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కి, జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కమిటీలో పదవులు వచ్చిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.టి. రాజేష్ కుమార్ చిలుకానగర్
ఉపాధ్యక్షుడు,
ఆడెపు శ్రీనివాసులు కాప్రా కార్యదర్శి,
అల్వాల అల్లూరయ్య కాప్రా కార్యదర్శి,
బిజ్జా ఆనంద్ గౌడ్ చెర్లపల్లి కార్యదర్శి,
సీహెచ్ పర్వతాలు మల్లాపూర్ కార్యదర్శి,
కె. రమేష్ కుమార్ గౌడ్ నాచారం కార్యదర్శి,
షేక్ అలీమ్ ఉప్పల్ కార్యదర్శి, చెవుల బాలయ్య వెంకట్ రెడ్డి నగర్ కార్యదర్శి,కె. బాల్‌రాజ్ గౌడ్ మల్లాపూర్ కార్యదర్శి,
దంతూరి రాజు గౌడ్ మల్లాపూర్ కార్యదర్శి,
గండికోట గణేష్ చిల్కా నగర్ కార్యవర్గ సభ్యుడు, బద్దం సత్తిరెడ్డి రామంతాపూర్ కార్యవర్గ సభ్యులుగా నియమిస్తు ఉత్తర్వులు ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

**● ఎస్సై విజయ్ కుమార్**
**అమరవీరుడు ఉన్నం చెన్నకేశవులకు ఘన నివాళులు**





**నిడమనూరు, జూన్ 16 (జర్నలిస్ట్ డైరీ)**
శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని స్థానిక ఎస్సై డి. విజయ్ కుమార్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుడు ఉన్నం చెన్నకేశవులు 23వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో చెన్నకేశవ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ, కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతరకు బలైన ఉన్నం చెన్నకేశవులు చేసిన త్యాగం పోలీసు శాఖకు చిరస్మరణీయమని అన్నారు. అమరవీరుల సేవలు, త్యాగాలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో పోలీసు సిబ్బంది శాంతి భద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చెన్నకేశవ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఉన్నం ఈశ్వర్ ప్రసాద్, ఉన్నం ఉషాకిరణ్, మాజీ నీటి సంఘం చైర్మన్ ఉన్నం శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నల్లమోతు వెంకటేశ్వర్లు, ఉన్నం శ్రీనివాస్, ఏదుళ్ల వినీల్ రెడ్డి, పోలీసు సిబ్బంది వెంకటేశ్వర్లు, రమేష్ నాయక్, నగేష్, ఆంజనేయులు, మహేష్, హోంగార్డులు అప్పారావు, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్-రెవిన్యూ భూముల సమస్యలు త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్



**తిరుమలగిరి (సాగర్), జూన్ 16 (జర్నలిస్ట్ డైరీ)**
ఫారెస్ట్, రెవిన్యూ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తిరుమలగిరి (సాగర్) తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఫైళ్లను పరిశీలించిన కలెక్టర్, ఫారెస్ట్ మరియు రెవిన్యూ భూములకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భూముల యాజమాన్య హక్కులు, సరిహద్దులు, గెజిట్ నోటిఫికేషన్లు, సంబంధిత పత్రాల నిర్వహణపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్, రెవిన్యూ శాఖల మధ్య ఉన్న భూవివాదాలు లేదా ఇతర సమస్యలు ఏవైనా ఉంటే వాటిని ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే భూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తూ కార్యాలయంలోని పలు విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ తనిఖీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా అటవీ అధికారి రాజశేఖర్, తహసీల్దార్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుంది

**ముఖ్యఅతిథిగా ఆమనగల్లు ఎస్ హెచ్ఓ వెంకటేశ్వర్లు**



**ఆమనగల్లు,జూన్16 (జర్నలిస్ట్ డైరీ)**
ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని, స్వీయ రక్షణకు విద్యార్థిని,విద్యార్థులు, మహిళలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని ఎస్ హెచ్ఓ వెంకటేశ్వర్లు, ఎస్సై కోటేశ్వరరావు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు.సీనియర్ కరాటే మాస్టర్ సి. జగదీశ్వర్ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థిని, విద్యార్థులకు వివిధ బెల్టు గ్రేడింగ్ లో పోటీలను నిర్వహించారు.ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంగళవారం పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో ఎస్ హెచ్ఓ వెంకటేశ్వర్లు, ఎస్సై కోటేశ్వరరావు,5వ వార్డుకౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థిని విద్యార్థులకు వివిధ రకాల బెల్టులను, మరియు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చిన మార్పులతో శరీరానికి శ్రమ లేకపోవడంతో ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందులకు గుర గురవుతున్నారని అన్నారు.రోజు కొంత సమయం ఆటలతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటే శిక్షణకు కేటాయించాలని సూచించారు.బాలికలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలి అని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ మాస్టర్ ప్రవీణ్ తల్లిదండ్రులు సనాతన చెన్నయ్య,మహేష్ ,శ్రీను నాయక్, అశోక్ ,మహేష్,భాస్కర్,హరీష్,తదితరులు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలను నమ్మవద్దు సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవు

**మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్**

**మిడ్జిల్, జూన్ 16, (జర్నలిస్ట్ డైరీ)**
సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్వీఎస్ హాస్పిటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం అనంతరం ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగినది. ఈ ఘర్షణ సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి, సంబంధిత వ్యక్తులపై FIR నమోదు చేయడం జరిగినట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. అయితే, ఈ సంఘటనను కొందరు వ్యక్తులు వాస్తవాలకు విరుద్ధంగా మతపరమైన ఘర్షణగా చిత్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు నిర్వహించడం పోలీసుల దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఘటన పూర్తిగా రోడ్డు ప్రమాదం అనంతరం చోటుచేసుకున్న వ్యక్తిగత వివాదానికి సంబంధించినదేనని, దీనికి ఎలాంటి మత, సామాజిక లేదా వర్గపరమైన కోణం లేదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. కొంతమంది వ్యక్తులు



జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్

నిర్ధారణ కాని సమాచారాన్ని, వాస్తవాలకు విరుద్ధమైన సందేశాలను సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు, అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నందున జిల్లా పోలీసు శాఖ వాటిని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజలు ఎటువంటి వదంతులను నమ్మవద్దని, అధికారిక సమాచారం కోసం పోలీసు శాఖ విడుదల చేసే ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని జిల్లా ఎస్పీ సూచించారు. సామాజిక మాధ్యమాలలో తప్పుడు, రెచ్చగొట్టే లేదా ప్రజలను తప్పుదోవ పట్టించే పోస్టులు, వీడియోలు, సందేశాలను ప్రచారం చేసే వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి సామాజిక సామరస్యాన్ని కాపాడాలని, అనుమానాస్పద పోస్టులు లేదా వదంతులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-112కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# వినాయక దేవాలయ నూతన భవనం,ప్రధాన ద్వారం ప్రారంభం





**కొత్తపేట, జూన్ 16 (జర్నలిస్ట్ డైరీ)**
కొత్తపేట డివిజన్ పరిధిలోని గాయత్రిపురం కాలనీలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయంలో నూతన భవనం, ప్రధాన ద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని నూతన భవనం, ప్రధాన ద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ, భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, దాతలను అభినందించారు. గాయత్రిపురం కాలనీ ప్రజలు ఐకమత్యంతో ఆలయ అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు దుద్దిల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, దాతల సహకారం, కాలనీవాసుల కృషితో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి, సద్గురు సాయిబాబా ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆలయ మరింత అభివృద్ధి కోసం దాతలు పెద్ద మనసుతో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్, వెంకట్ రెడ్డి, గాయత్రిపురం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దిల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, కోశాధికారి అనంత రాములు, ఉపాధ్యక్షుడు జే. బాలరాజు, జితేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్, ముఖ్య సలహాదారు డాక్టర్ రాజయ్య గుప్తతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఘనంగా విహెచ్ జన్మదిన వేడుకలు..

**- శుభాకాంక్షలు తెలిపిన సేవాదళ్ ప్రధాన కార్యదర్శి లిక్కి వెంకట్ రెడ్డి.**



**హైదరాబాద్ (జూన్ 16) (జర్నలిస్ట్ డైరీ)**
రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సేవాదళ్ కార్యదర్శి లిక్కి వెంకట్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా లిక్కి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, వి. హనుమంతరావు ప్రజా సేవ, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.జన్మదిన వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వి. హనుమంతరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు

# కాంగ్రెస్‌లో కలకలం రేపిన రహస్య సమావేశం..

**-కీలక నేత రాజకీయ అడుగులపై ఉత్కంఠ.. !**
**-'హ్యాండ్'కు హ్యాండ్ ఇస్తారా?.. 'కార్' వైపు కీలక నేత చూపు!**
**-స్థానిక ఎన్నికల ముందు గుర్రంపోడులో రాజకీయ బాంబ్.. -కాంగ్రెస్ శిబిరంలో టెన్షన్..**
**-ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధుల రహస్య సమావేశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం**
**-బీఆర్ఎస్ లో చేరిక ఊహాగానాలు.. లేక శక్తి ప్రదర్శన వ్యూహమా..?**
**-మండల రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశాలపై విశ్లేషణ**



**గుర్రంపోడు, జూన్ 16 (జర్నలిస్ట్ డైరీ)**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాలు రోజురోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. తాజాగా గుర్రంపోడు మండలంలో జరిగిన ఓ రహస్య సమావేశం అధికార కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపుతోంది. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఓ కీలక మాజీ ప్రజాప్రతినిధి నివాసంలో మంగళవారం జరిగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అత్యంత గోప్యంగా నిర్వహించిన ఈ సమావేశానికి ప్రస్తుత, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పలువురు స్థానిక నాయకులు హాజరైనట్లు సమాచారం. సాధారణంగా రాజకీయ సమావేశాలకు భిన్నంగా ఎలాంటి అధికారిక ప్రకటనలు లేకుండా ఈ భేటీ జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇంత పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు ఒకచోట సమావేశం కావడం వెనుక ప్రత్యేక రాజకీయ వ్యూహం ఉందనే ప్రచారం జరుగుతోంది. సమావేశంలో రాబోయే ఎన్నికల వ్యూహాలు, మండలంలోని రాజకీయ పరిస్థితులు, స్థానిక నాయకత్వంపై ఉన్న అసంతృప్తి, భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం బయటకు రాలేదు. ఇదిలా ఉండగా, సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన మాజీ ప్రజాప్రతినిధి కాంగ్రెస్ పార్టీకి దూరమవుతూ ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారనే ప్రచారం మండల రాజకీయాల్లో వేడిని పెంచుతోంది. తన అనుచర వర్గంతో భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై చర్చించేందుకే ఈ భేటీ నిర్వహించినట్లు కొందరు భావిస్తుండగా, మరికొందరు మాత్రం పార్టీ మార్పు కంటే కాంగ్రెస్‌లోనే తన రాజకీయ ప్రభావాన్ని చాటుకోవడం లక్ష్యంగా ఈ సమావేశం జరిగి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామంతో గుర్రంపోడు కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. అసంతృప్త నాయకులు ఏకమవుతున్నారనే సంకేతాలు కనిపిస్తుండటంతో స్థానిక నాయకత్వం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. సమావేశం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం ఏమిటి, సంబంధిత నేత తదుపరి రాజకీయ అడుగు ఎలా ఉండబోతోంది అనే అంశాలపై ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు చోటుచేసుకున్న ఈ రహస్య భేటీ మండల రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశముందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఎలాంటి రూపం దాల్చుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# భూత్పూర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ



**మిడ్జిల్, జూన్ 16, (జర్నలిస్ట్ డైరీ)**
మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి--44 పై భూత్పూర్ ఫ్లైఓవర్ సమీపంలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందడం జరిగినది. అమిస్తాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై కర్నూల్ నుండి మహబూ వరకు వైపు ప్రయాణిస్తు ఫ్లైఓవర్ దగ్గర రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక వైపు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న మరో యువకుడు చికిత్స పొందుతూ అనంతరం మృతి చెందాడు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా భూత్పూర్ సబ్ఇన్‌స్పెక్టర్‌ను ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు, సంఘటన అనంతరం చేపట్టిన చర్యలు, దర్యాప్తు పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని, అధిక వేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ఇటువంటి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

# నేనావత్ బాలు నాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

**-నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడ సైదులు**
**-మంత్రి వర్గంలో లంబాడ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలి**





**దేవరకొండ, జూన్ 16 (జర్నలిస్ట్ డైరీ)**
తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నాయకుడు, దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడ సైదులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన లంబాడ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ, సామాజిక న్యాయం పాటించే క్రమంలో బాలు నాయక్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. అత్యంత వెనుకబడిన మరియు గిరిజన జనాభా అధికంగా కలిగిన మారుమూల దేవరకొండ నియోజకవర్గం నుంచి ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన బాలు నాయక్, అట్టడుగు స్థాయి నుండి నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. తొలుత ఎంపీటీసీగా ప్రస్థానాన్ని ప్రారంభించి, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించిన బాలు నాయక్‌కు పరిపాలనా పరంగా మరియు రాజకీయ పరంగా అపారమైన అనుభవం ఉందని, అది రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.గత పది సంవత్సరాల కాలంలో దేవరకొండ ప్రాంతం ఘోరమైన నిర్లక్ష్యానికి గురైందని, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బాలు నాయక్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఈ ప్రాంతంలో అభివృద్ధికి పునాదులు పడ్డాయని మేడ సైదులు వివరించారు. ఆ రోజుల్లోనే నియోజకవర్గంలోని ప్రతి మారుమూల తండాకు రోడ్డు సౌకర్యం, విద్యుత్ సరఫరా మరియు తాగునీరు అందించి గిరిజన ప్రాంతాల రూపురేఖలను బాలు నాయక్ మార్చివేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఎస్.ఎల్.బి.సి (నాదీజ) సొరంగ మార్గం పనులను పూర్తి చేయాలన్నా, డిండి ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాంత సాగునీటి కష్టాలను తీర్చాలన్నా బాలు నాయక్‌కు మంత్రి పదవి దక్కడం అనివార్యమని స్పష్టం చేశారు. సింగరాజుపల్లి ఎత్తిపోతల పథకం, నక్కలగండి, గొట్టిముక్కల, పెండ్లిపాకుల, అక్కంపల్లి వంటి కీలకమైన రిజర్వాయర్లను పూర్తి చేసి దేవరకొండను సస్యశ్యామలం చేయాలంటే బాలు నాయక్‌కు అధికారంలో ప్రాధాన్యత ఉండాలని పేర్కొన్నారు.బాలు నాయక్ కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా, నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాలను పంచుకునే ప్రజా మనిషిగా గుర్తింపు పొందారని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా, నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందేలా నిరంతరం ప్రోత్సహిస్తారని తెలిపారు. క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించి వారిని అన్ని విధాల ఆదుకుంటున్న అభివృద్ధి ప్రదాతగా, గిరిజన ముద్దుబిడ్డగా బాలు నాయక్ పేదల ఆశాజ్యోతిగా నిలిచారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాలు నాయక్‌కు మంత్రి పదవి కట్టబెడితే, ప్రత్యేక నిధులతో నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని, తద్వారా ఈ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మరియు ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటారని మేడ సైదులు ఆశాభావం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల గొంతుకగా నిలిచే బాలు నాయక్ సేవలను రాష్ట్ర స్థాయిలో వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అంగన్వాడి కేంద్రాల్లో అమ్మ మాట..అంగన్వాడి బాట

**ముఖ్యఅతిథిగా సిడిపిఓ శాంతి రేఖ....**



**ఆమనగల్లు,జూన్16 (జర్నలిస్ట్ డైరీ)**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం 10వ సెంటర్ లో మంగళవారం అంగన్వాడి టీచర్లు చిన్నారులతో అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ శాంతి రేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతి రేఖ మాట్లాడుతూ 3 సం"..6 సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రంలోనే చేర్పించాలన్నారు. అంగన్వాడీలో ప్రీస్కూల్ కార్యక్రమాల గురించి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారులలో అన్ని రకాలుగా అభివృద్ధి జరగాలి అంటే తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపాలని, చిన్నారులకు బలవర్ధకమైన మంచి పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తారని వివరించారు. అక్షరాభ్యాసం అనంతరం ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అనిత, టీచర్ నాజిమా బేగం,ఆయా యాదమ్మ ,చిన్నారుల తల్లులు,చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్లు..

### 544 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్




భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా లాభపడ్డాయి. వరుసగా మూడో సెషన్‌లోనూ లాభాలు పొందడం విశేషం. సెన్సెక్స్ 544 పాయింట్లు, నిఫ్టీ 135 పాయింట్లు లాభపడ్డాయి. హార్ముజ్ జలసంధి తెరిచి ఉంచడం, ఇరాన్–అమెరికా మధ్య శాంతి ఒప్పందం మార్కెట్‌కు లాభాలు తెచ్చిపెట్టాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 544.15 పాయింట్లు లాభపడి 76,808.48 పాయింట్ల వద్ద ముగిసింది.ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 135.25 పాయింట్లు లాభపడి, 23,989.15 పాయింట్ల వద్ద ముగిసింది. 24,000 మార్క్‌కు నిఫ్టీ దాదాపు 11 పాయింట్ల దూరంలో నిలిచిపోయింది. గత మూడు సెషన్లు కలిపి సెన్సెక్స్ 4 శాతం, నిఫ్టీ 3.6 శాతం లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర 2.57 శాతం తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 81.03 డాలర్ల వద్ద ట్రేడయింది. అలాగే, డబ్ల్యూటీఐ క్రూడాయిల్ ధర కూడా 2.71 శాతం తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 78.56 డాలర్ల వద్ద కొనసాగింది. ఆసియా మార్కెట్లు కూడా మంగళవారం 0.8 శాతం లాభాలు పొందాయి. రూపాయి కూడా స్వల్పంగా లాభపడింది. డాలర్‌తో రూపాయి విలువ 94.6 వద్ద కొనసాగింది. బీఎస్ఈ30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, హిందుస్తాన్ యునీలీవర్ లాభాలు పొందాయి. వీటిలో అత్యధికంగా హెచ్‌సీఎల్ టెక్ సంస్థ షేర్లు 3.59 శాతం పెరిగాయి. మరోవైపు మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్, బీఈఎల్, టాటా స్టీల్, ఇండిగో సంస్థల షేర్లు నష్టపోయాయి. ఇండిగో షేర్లు 0.86 శాతం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్30 సూచీలో 21 కంపెనీలు లాభాలు పొందగా, 9 సంస్థలు నష్టపోయాయి. శుక్రవారం నుంచి హార్ముజ్ జలసంధి పూర్తిస్థాయిలో తెరుచుకుంటుందనే ప్రకటన, ఇరాన్‌తో శాంతి ఒప్పందం, చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు సానుకూల ఫలితాలు తీసుకొచ్చాయి.

# పడిపోయిన బంగారం ధరలు..

బంగారం కొనుగోలు చేసేవారికి గుడ్ న్యూస్. గోల్డ్ రేట్లు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై ఈ నెలలో సంతకాలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన క్రమంలో గోల్డ్ రేట్లలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రేట్లు అంతకంతకు దిగొస్తున్నాయి. మంగళవారం ధరలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం దేశంలోని వివిధ నగరాల్లో రేట్లు ఎలా ఉన్నాయనేది ఒకసారి చూద్దాం..దేశీయ బులియన్ మారట?ట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ప్రస్తుతం రూ.1,51,370 వద్ద కొనసాగుతోంది. ఒక్కరోజే రూ.160 తగ్గింది. ఇక 22 క్యారెట్ల ధర ఇప్పుడు రూ.1,38,750 వద్ద ట్రేడవుతోంది. మంగళవారం రూ.150 తగ్గింది. ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,51,370 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,38,750 వద్ద ట్రేడవుతోంది.చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,53,380 వద్ద కొనసాగుతోండగా.. 22



క్యారెట్ల బంగారం ధర రూ.1,40,600 వద్ద ట్రేడవుతోంది. ఇక బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,51,370 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,38,750 వద్ద ట్రేడవుతోంది.ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,520 వద్ద ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,38,900గా ఉంది. అటు ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,370 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,38,750 వద్ద ఉంది.అటు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. ఢిల్లీలో కేజీ సిల్వర్ ధర రూ.2.65 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2.75 లక్షలుగా ఉండగా.. నిన్న రూ.2.80 లక్షలుగా ఉంది. మంగళవారం రూ.5 వేలు తగ్గింది. చెన్నైలో కేజీ సిల్వర్ ధర రూ.2.75 లక్షలుగా ఉంది. నిన్న ఈ ధర రూ.2.80 లక్షల వద్ద కొనసాగుతోంది.

# ఇన్ఫినిక్స్ స్మార్ట్ 20 4జీ ఫోన్ విడుదల..

### ఎంట్రీ లెవెల్ ధరలోనే ఏఐ ఫీచర్లు, హెచ్‌డీం స్క్రీన్

ఇన్ఫినిక్స్ సంస్థ స్మార్ట్ సిరీస్‌లో వరుసగా ఫోన్లు రిలీజ్ చేస్తుంటుంది. తాజాగా ఇన్ఫినిక్స్ స్మార్ట్ 20 పేరుతో 4జీ ఫోన్ విడుదల చేసింది. ఇప్పటికే ఈ ఫోన్ సేల్‌లో అందుబాటులోకి వచ్చింది. ధర ఎంట్రీ లెవెల్‌లోనే ఉన్నప్పటికీ ఏఐ ఫీచర్లు, హెచ్‌డీం స్క్రీన్, ఫాస్ట్ ఛార్జింగ్ వంటి ఫీచర్లున్నాయి. బేసిక్ ఫోన్ కావాలనుకునేవారు ఈ ఫోన్ కొనుగోలు చేయొచ్చు. ఫ్లిప్‌కార్ట్, ఇన్ఫినిక్స్ సైట్‌లలో మొబైల్ కొనుగోలు చేయవచ్చు. డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ వంటి ఫీచర్లున్నాయి. ఈ ఫోన్‌కు సంబంధించిన పూర్తి ఫీచర్లివి. 4జీబీం64జీబీ, 4జీబీం128జీబీ, 6.78 అంగుళాల హెచ్‌డీం ఎల్‌సీడీ స్క్రీన్, 120 హెర్జ్ రిఫ్రెష్‌రేట్, 700 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, ఆల్వేస్ ఆన్ డిస్‌ప్లే, డైనమిక్ బార్




నోటిఫికేషన్స్, మీడియాటెక్ హీలియో జీ81 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 బేస్డ్ ఎక్స్ఓఎస్ 16, తెలుగు, తమిళ్, హిందీ, గుజరాతీ, మరాఠీల్లో పని చేసే ఫోలక్స్ వాయిస్ అసిస్టెంట్, బ్లూటూత్ 5.2, 8ఎంపీ రేర్ కెమెరా విత్ ఫ్లాష్, 8 ఎంపీ సెల్ఫీ కెమెరా, 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ, 15 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్, 5 వాట్స్ రివర్స్ వైర్డ్ ఛార్జింగ్, 7.7 ఎంఎం థిక్‌నెస్, ఐపీ 64 రేటింగ్ వంటి ఫీచర్లున్నాయి. సన్‌లైక్ ఆరెంజ్, షాడో బ్లాక్, పోలారిస్ టైటానియం, క్లౌడ్‌లైన్ బ్లూ కలర్స్‌లో లభ్యం. ధరలు రూ.12,499/రూ.13,999.

# స్పోర్ట్స్

# పాకిస్థాన్ జట్టుకు మరో షాక్..

### మ్యాచ్ ఫీజులో కోత..!

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్ కు మరో షాక్. స్లో ఓవర్ రేటు కారణంగా ఆ జట్టుకు జరిమానా పడింది. జూన్ 4 ఆదివారం బర్మింగ్‌హామ్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయనందుకు రిఫరీ ఫైన్ విధించారు.ప్రపంచకప్ ఆరంభ పోరులో 64 పరుగుల తేడాతో ఓడిన పాకిస్థాన్‌కు ఐసీసీ షాకిచ్చింది. టీమిండియాతో మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు ఫలితంగా పాక్‌కు మ్యాచ్ ఫీజులో కోత పడింది. ఆన్ ఫీల్డ్ అంపైర్లు క్లేరీ పొలోసాక్, జాక్వెలిన్ విలియమ్స్, థర్డ్ అంపైర్ సూ రెడ్‌ఫెర్న్, ఎలోసే షెరిడాన్‌లు స్లో ఓవర్ రేటును



గుర్తించారు.పాక్ కెప్టెన్ ఫాతిమా సనా తన పొరపాటును అంగీకరించింది. దాంతో, ఎమిరేట్స్ ఐసీసీ ఇంటర్నేషనల్ ప్యానెల్ మ్యాచ్ రిఫరీ ట్రుడీ అండర్సన్ పాక్ జట్టు ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి మ్యాచ్ ఫీజులో 5 శాతం జరిమానా వేశారు. భారత్ నిర్దేశించిన 171 పరుగుల ఛేదనలో పాక్ 106కే కుప్పకూలింది. దీప్తి శర్మ ఐదు వికెట్లు, శ్రీ చరణి మూడు వికెట్లతో చెలరేగడంతో టీమిండియా 64 రన్స్ తేడాతో జయభేరి మోగించింది.

# శ్రీలంక ఆటగాళ్లే హద్దులు దాటారు..


### వైభవ్‌కు అండగా నిలిచిన తిలక్ వర్మ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో ఏతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ సహనం కోల్పోయి ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవకు దిగిన సంగతి తెలిసిందే. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్–ఏ సూపర్ ఓవర్‌లో ఓటమిపాలైంది. సూపర్ ఓవర్ ముగిసిన అనంతరం బయటకు వెళ్లే సమయంలో వైభవ్ సూర్యవంశీని శ్రీలంక ఆటగాళ్లు ఏదో అనగా.. అతను వారిపైకి దూసుకెళ్లాడు. ఓ ఆటగాడిని తన చేతులతో నెట్టేసాడు. అంపైర్లు, శ్రీలంక వికెట్ కీపర్ జోక్యం చేసుకొని ఇద్దర్ని విడదీసారు. ఈ ఘటన నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీపై ఐసీసీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.మరోవైపు 15 ఏళ్ల వయసులోనే సహనం కోల్పోయి ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవపడిన వైభవ్ సూర్యవంశీని మాజీ క్రికెటర్లు తప్పుబట్టారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండి ఆటపై ఫోకస్ పెట్టాలని హితవు పలికారు.అయితే ఈ విమర్శల నేపథ్యంలో కొందరు ఆకతాయిలు.. వైభవ్ సూర్యవంశీకి అండగా ఫేక్ పోస్టులు క్రియేట్ చేసి వైరల్ చేశారు. భారత్–ఏ కెప్టెన్ తిలక్ వర్మ అండగా నిలిచినట్లు ఓ ఫేక్ వార్త సృష్టించారు. ఈ మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడుతూ తిలక్ వర్మ..



వైభవ్ సూర్యవంశీకి అండగా నిలిచాడనేది ఆ వార్త. ఈ పోస్ట్ ప్రకారం.. 'మ్యాచ్ ఆసాంతం శ్రీలంక ఆటగాళ్లు మమ్మల్ని నిరంతరం దూషిస్తూనే ఉన్నారు. చివరకు అంపైర్లు కూడా కొన్ని నిర్ణయాలు వారికి అనుకూలంగా తీసుకున్నారు. మేం వాటన్నింటినీ పట్టించుకోకుండా ఆటపై మాత్రమే ఫోకస్ పెట్టాం. కానీ, వైభవ్ డ్రెస్సింగ్ రూమ్‌కు తిరిగి వెళ్తున్న సమయంలో శ్రీలంక ఆటగాళ్లలో ఒకరు అనవసరంగా అతన్ని దూషించాడు. అది హద్దులు దాటడమే. దానికి వైభవ్ సూర్యవంశీ గట్టిగా బదులిచ్చాడు. అతను చేసింది సరైన పనే'అని తిలక్ వర్మ అన్నట్లుగా ఫేక్ పోస్ట్‌ను క్రియేట్ చేశారు. అయితే ఈ మ్యాచ్ అనంతరం తిలక్ వర్మ ఏ బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడలేదు. వైభవ్ సూర్యవంశీ గొడవ గురించి కూడా మాట్లాడలేదు. కానీ ఇది నిజమేనని పొరబడి కొందరు నెటిజన్లు ఈ పోస్ట్‌ను షేర్ చేస్తున్నారు.తిలక్ వర్మనే కాకుండా అతని చిన్న నాటి కోచ్ కూడా వైభవ్ సూర్యవంశీకి అండగా మాట్లాడినట్లు కూడా ఫేక్ పోస్ట్ క్రియేట్ చేశారు. 'నేను వైభవ్ సూర్యవంశీకి ఏడేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి కోచింగ్ ఇస్తున్నాను. అతని ప్రవర్తన గురించి నాకు బాగా తెలుసు. అసలు ఏం జరిగిందో తెలుసుకోకుండానే ప్రజలు అతనిపై ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నారు. నిన్న రాత్రి నేను వైభవ్‌తో మాట్లాడాను. మ్యాచ్ ఆసాంతం శ్రీలంక ఆటగాళ్లు తనను నిరంతరం దూషించారని, చివరికి తనపై వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేశారని అతను నాతో చెప్పాడు. అతను చాలా సేపటి వరకు ప్రశాంతంగానే ఉన్నాడు, కానీ ఎవరికైనా ఒక పరిమితి ఉంటుంది. పదే పదే రెచ్చగొట్టడం వల్లే అతను అలా స్పందించాల్సి వచ్చింది. అతనిని విమర్శించే బదులు, మనం అతనికి అండగా నిలవాలి. అలాగే ఏదైనా ఒక నిర్ణయానికి వచ్చే ముందు పూర్తి విషయాన్ని అర్థం చేసుకోవాలి.'అని వైభవ్ సూర్యవంశీ చిన్ననాటి కోచ్ చెప్పినట్లు ఓ ఫేక్ పోస్ట్ క్రియేట్ చేశారు.

## అర్ధశతకంతో చెలరేగిన నీలాక్షిక..
## అదిరే బోణీ కొట్టిన శ్రీలంక..!





మహిళల టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంక అదిరే బోణీ కొట్టింది. సౌతాంప్టన్ మైదానంలో న్యూజిలాండ్‌ను లంక చిత్తు చేసింది. 151 పరుగుల ఛేదనలో టాపార్డర్ విఫలమైనా.. నీలాక్షిక సిల్వా(54 నాటౌట్), కౌషనీ నుత్యంగన(24 నాటౌట్)లు వైట్ ఫెర్న్ ఆశలపై నీళ్లు చల్లారు. క్రీజనంటుకున్న ఈ ద్వయం చివరిదాకా నిలబడి 5 వికెట్ల తేడాతో జట్టును గెలిపించింది. దాంతో.. మెగా టోర్నీలో కివీస్‌కు వరసగా రెండో ఓటమి ఎదురైంద.ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న మహిళల పొట్టి ప్రపంచకప్‌లో శ్రీలంక పాయింట్ల ఖాతా తెరిచింది. తొలి మ్యాచ్‌లో చేతిలో ఓడిన లంక.. రెండో మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను వణికించింది. తొలుత లంక బౌలర్లు కట్టడి చేసినా.. మేలియా ఖేర్(45), సోఫీ డెవినె(45)లు రాణించగా కివీస్ 150 రన్స్ కొట్టింది. అనంతరం ఛేదనలో 55 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది లంక. ఆ దశలో క్రీజులోకి వచ్చిన నీలాక్షిక సిల్వా(54 నాటౌట్), కవిశ దిల్హారి(17) పట్టుదలగా ఆడారు.టాపార్డర్ తేలిపోయిన చోట కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న నీలాక్షిక, కవిశ ద్వయం ఐదో వికెట్‌కు యాభై రన్స్ జోడించింది. వీరిద్దరూ స్కోర్ వంద దాటించగా.. కౌషనీ నుత్యంగన(24 నాటౌట్) జతగా నీలాక్షి లాంఛనం ముగించింది. చివరి ఓవర్లో నాలుగో బంతికి కౌషనీ బౌండరీ బాదడంతో లంక ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఫలితంగా వరసగా రెండో ఓటమితో న్యూజిలాండ్ నిరాశలో కూరుకుపోయింది. ఒత్తిడిలోనూ కీలక ఇన్నింగ్స్ ఆడిన నీలాక్షి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుకు ఎంపికైంది.



హాట్ హాట్ ఫొటోస్ తో హీట్ పుట్టిస్తున్న హన్సిక..

# విశ్వంభర విడుదల తేదీపై సందిగ్ధత

## అధికారికంగా ప్రకటించని మేకర్స్




మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో-ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'విశ్వంభర' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో కొనసాగుతున్న అనిశ్చితి మెగా ఫ్యాన్స్‌ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే అంశంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్‌ను మరోసారి ఫాంటసీ ప్రపంచంలో చూడబోతున్నామని అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. అయితే షూటింగ్ పూర్తయినప్పటికీ విడుదల తేదీపై ఇంకా స్పష్టత లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మొదట ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఆగస్టు రిలీజ్‌పై కూడా వార్తలు వినిపించాయి. కానీ చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో ఆ వార్తలన్నీ కేవలం ఊహాగానాలు గానే మిగిలిపోయాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'విశ్వంభర'ను ఈ ఏడాది దసరా కానుకగా విడుదల చేయాలనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు తెలుస్తోంది. దసరా సీజన్‌కు భారీ చిత్రాలకు మంచి మార్కెట్ ఉండటంతో ఈ పండుగను లక్ష్యంగా పెట్టుకున్నారని టాక్ వినిపిస్తోంది.దీనికి ప్రధాన కారణం రాబోయే నెలల్లో టాలీవుడ్‌లో భారీ చిత్రాలు క్యూ కడుతుండడం. డిసెంబర్ నుంచి వరుస స్టార్ హీరోల సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. అలాగే 2027 సంక్రాంతి, సమ్మర్ సీజన్లు కూడా ఇప్పటికే పలు క్రేజీ ప్రాజెక్టులతో బుక్ అయ్యాయి. దీంతో 'విశ్వంభర'కు సరైన విడుదల తేదీ ఎంపిక చేయడం మేకర్స్‌కు సవాలుగా మారిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.


# గ్లామర్‌కు గుడ్‌బై ,యాక్షన్ మోడ్‌లో కాజల్ అగర్వాల్ ..

## -అమ్మడి స్పీడ్ మాములుగా లేదుగా..!



టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. రెండు దశాబ్దాలుగా దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్న కాజల్, ఇప్పుడు తన సెకండ్ ఇన్నింగ్స్‌లో పూర్తిగా భిన్నమైన పాత్రలపై దృష్టి సారిస్తోంది. గ్లామర్ రోల్స్‌కు దూరంగా ఉంటూ, కథకు ప్రాధాన్యత ఉన్న పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే కాజల్ అగర్వాల్ తొలిసారి ఓటీటీ ప్రపంచంలో అడుగుపెట్టబోతోంది. 'స్వామి రారా' ఫేమ్ దర్శకుడు సుధీర్ వర్మ తెరకెక్కిస్తున్న 'విశాఖ' వెబ్ సిరీస్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సిరీస్‌పై ఇండస్ట్రీలో మంచి అంచనాలు నెలకొన్నాయి.'విశాఖ'లో కాజల్ పాత్ర ఈ సిరీస్‌కు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. ఒకవైపు సాధారణ గృహిణిగా కనిపించే ఆమె పాత్ర, మరోవైపు అండర్‌వల్డ్ ప్రపంచాన్ని శాసించే లేడీ డాన్‌గా మారడం కథలో కీలక మలుపుగా ఉండబోతోందని టాక్ వినిపిస్తోంది. అమాయకత్వం, ఆవేశం, శక్తివంతమైన నాయకత్వం వంటి విభిన్న భావోద్వేగాలను ఒకే పాత్రలో చూపించే అవకాశం కాజల్‌కు దక్కిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సిరీస్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గన్ పట్టుకుని శత్రువులను ఎదుర్కొనే లేడీ డాన్ అవతారంలో కాజల్ కనిపించనున్న సన్నివేశాలు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయని సమాచారం. ఇప్పటికే విడుదలైన అంతర్గత ప్రచార సమాచారం ప్రకారం, ఈ సిరీస్‌లో ఆమె కెరీర్‌లో ఇప్పటివరకు చేయని స్థాయిలో యాక్షన్ సన్నివేశాలు ఉండనున్నాయి. ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ప్రకారం, ఈ సిరీస్‌కు బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన సుస్మితా సేన్ 'ఆర్య' వెబ్ సిరీస్ తరహా ట్రీట్‌మెంట్ ఉండబోతోందట. అయితే కథ, పాత్రలు, కథనం పూర్తిగా కొత్తగా ఉండేలా దర్శకుడు సుధీర్ వర్మ రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న 'విశాఖ' వెబ్ సిరీస్ జూలై లేదా ఆగస్టు నెలలో జియో హాట్‌స్టార్ వేదికగా ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. అధికారిక విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఇదిలా ఉంటే, కాజల్ అగర్వాల్ సినిమాల పరంగానూ బిజీగా ఉంది. నందమూరి బాలకృష్ణ హీరోగా, దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ఆమె కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు కలిగిస్తోంది. ఒకవైపు వెబ్ సిరీస్‌లు, మరోవైపు భారీ సినిమాలు చేస్తూ కాజల్ అగర్వాల్ తన కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్తోంది. ముఖ్యంగా మహిళా ప్రధాన కథలు, బలమైన పాత్రలను ఎంచుకుంటూ సెకండ్ ఇన్నింగ్స్‌లో మరింత శక్తివంతంగా ముందుకు సాగుతోంది.

# కల్కి సీక్వెల్‌లో ఆలియా భట్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ వండర్ 'కల్కి 2898 ఏడి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. పురాణాల నేపథ్యంతో తెరకెక్కిన ఈ విజువల్ వండర్‌కు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల నటన ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది. ప్రస్తుతం ఈ భారీ బ్లాక్‌బస్టర్ సీక్వెల్ 'కల్కి-2' కూడా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ క్రమంలోనే 'కల్కి' ఫ్రాంచైజీ నుంచి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. గతంలో మొదటి భాగంలో నటించిన దీపికా పదుకొనె కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఆలియా భట్ దీపికా పోషించిన 'సుమతి' పాత్రను చేయడం లేదని తెలుస్తుంది. ఈ సినిమాలో వచ్చే ఒక పవర్‌ఫుల్ స్పెషల్ రోల్‌లో ఆమె కనిపించనున్నట్లు సమాచారం. మరింత షాకింగ్ విషయమేమిటంటే.. ఆలియా భట్ ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన కొంతమేర షూటింగ్‌ను కూడా సైలెంట్‌గా పూర్తి చేసిందని టాక్. 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన ఆలియా.. ఇప్పుడు ఈ క్రేజీ సైన్స్ ఫిక్షన్ సీక్వెల్‌లో భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచేస్తోంది. ఈ అలియా ఎంట్రీపై త్వరలోనే వైజయంతీ మూవీస్ టీమ్ నుండి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# వారణాసి బిజీలో మహేశ్‌బాబు

## సందీప్ వంగాతో మూవీపై అప్పుడే క్లారిటీ

సూపర్ స్టార్ మహేశ్ బాబు, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో సినిమా రాబోతోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై ఈ క్రేజీ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మహేశ్ బాబు ప్రస్తుతం రాజమౌళితో చేస్తున్న 'వారణాసి', సందీప్ వంగా కమిట్ అయిన 'స్పిరిట్', 'యానిమల్ పార్క్' ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ఈ కాంబో సెట్ అయ్యే అవకాశం ఉందని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. నిజానికి వీరిద్దరి కలయికలో సినిమా రావడం ఇదే మొదటి ఆలోచన కాదు. గతంలో ఏషియన్ సినిమాస్ నిర్మాణంలోనే మహేశ్, సందీప్ వంగా కలిసి 'డెవిల్' అనే సినిమా చేయాల్సి ఉంది. ఆ సమయంలో ఇద్దరికీ ఈ నిర్మాణ సంస్థ అడ్వాన్స్‌లు కూడా ఇచ్చినట్లు సమాచారం. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. అప్పటి నుంచి ఈ ఇద్దరి కాంబినేషన్ కోసం టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ప్రస్తుతానికి ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మహేశ్ 'వారణాసి' చిత్రం ముగిసిన తర్వాతే ఈ ప్రాజెక్ట్‌పై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరి నిజంగానే ఈ కాంబో సెట్ అవుతుందో లేదో చూడాలి.



Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465